

నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు

పాలమూరు హైస్కూల్లో అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ తనిఖీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

పాలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో బియ్యం, కోడిగుడ్ల నిల్వలను పరిశీలించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం తీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. బియ్యంలో గంజిని తొలగించకుండా ఇగిరిపోయేలా అన్నం ఉడికించాలని నిర్వాహకులకు సూచించారు. నిల్వ కోడిగుడ్లు ఎట్టి పరిస్థితుల్లో వండి పిల్లలకు పెట్టకూడదని హెచ్చరించారు. శుచి, శుభ్రత పాటించి ఆహార పదార్థాలను తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక ద్వారా తర్ఫీదు ఇచ్చి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని ఇన్‌ఛార్జి హెచ్‌ఎం చంద్రశేఖర్‌ను కోరారు. ఆయన వెంట ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు, ఎండిఎం, సహాయాధికారి ఆశీర్వాదం పాల్గొన్నారు.

ఉలికిపాటు..!

ఏలూరులో 15 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పూర్వ ఘటనలు గుర్తు తెచ్చుకున్న జిల్లావాసులు



మావోయిస్టులను రహస్య ప్రాంతానికి తరలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా వాసులు మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జిల్లా కేంద్రమైన ఏలూరు నగర శివార్లలో 15 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో సంచలనం సృష్టించింది. గతంలో ఏజెన్సీ ప్రాంతమైన పోలవరం, బుట్టాయగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను మావోయిస్టులు షెల్టర్ జోన్‌గా వినియోగించుకుంటున్నారని తెలియడం తప్ప నగరంలోనే మకాం వేయడం అందరినీ కలవరపాటుకు గురి చేసింది.

మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ అనంతరం అందిన సమాచారం మేరకు జిల్లా ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్ స్వయంగా రంగంలోకి దిగి ఏలూరు నగర శివార్లలోని కెకెఆర్ గ్రీన్‌సిటీ (గేటెడ్ కమ్యూనిటీ)ని సుమారు 150 మంది పోలీసులతో మంగళవారం మధ్యాహ్న సమయంలో చుట్టుముట్టారు. డ్రోన్ సహాయంతో గ్రీన్‌సిటీ పరిసరాలను జల్లెడ పట్టి ఇతర భవనాలకు కొంచెం దూరంలో ఉన్న రెండంతస్తుల భవనంలో మావోయిస్టులు ఉన్నట్లు గుర్తించి ఆ భవనాన్ని ప్రత్యేక పోలీసు బలగాలు చుట్టుముట్టాయి. అదే క్రమంలో గ్రేహౌండ్స్ బలగాలు ఆ భవనంలోకి చొచ్చుకెళ్లి మొత్తం 15 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఐదుగురు మహిళలు కూడా ఉన్నారు. వారి వద్ద నుంచి 15 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వారిని వెంటనే ప్రత్యేక వాహనాల్లో జిల్లా కేంద్రానికి సమీపంలోనే రహస్య ప్రాంతానికి తరలించి విచారిస్తున్నారు. వీరు సుమారు వారం, పది రోజుల నుంచి ఇక్కడ ఉంటున్నట్లు తెలిసింది. ఈ భవనం ఏలూరులోని ఒక ప్రయివేటు కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న వ్యక్తిగా గుర్తించి, అతనిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



మావోయిస్టులు బస చేసింది ఈ భవంతిలోనే

మావోయిస్టులు కేవలం షెల్టర్ జోన్‌గా ఉపయోగించుకునేందుకు ఏలూరు వచ్చారా, లేదా పరిసర ప్రాంతాల్లో ఏదైనా విధ్వంసానికి పాల్పడేందుకు వచ్చారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ మావోయిస్టులంతా చత్తీస్‌ఘడ్‌కు చెందిన వారిగా గుర్తించారు. ఎటువంటి ప్రతిఘటనా లేకుండానే మావోయిస్టులను పట్టుకోగలగడంతో పోలీసులు సైతం ఊపిరి పీల్చుకున్నారు.

గత ఘటనలు గుర్తు చేసుకున్న జిల్లా వాసులు

మావోయిస్టులు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాన్ని షెల్టర్‌జోన్‌గా ఉపయోగించుకోవడం గతంలో ఉండేది. ఆ క్రమంలోనే కొన్ని ఘటనలు సైతం చోటుచేసుకున్నాయి. పోలవరం మండలం ఎల్ఎన్‌డి పేట వద్ద సాయంత్రం సమయంలోనే పోలీసులకు నక్సలైట్లకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. అలాగే పోలవరం మండలంలో దేరా కొండల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు క్రాంతి దళానికి చెందిన నక్సలైట్లు మృతి చెందారు. గతంలో 2001లో ఏలూరు రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకున్న పేలుడు కూడా మావోయిస్టుల వల్లేనని పోలీసులు అప్పట్లో ప్రకటించారు. సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్తున్న రైలు నుంచి రాత్రి సమయంలో దిగిన ప్రయాణికులు నడుచుకుంటూ ట్రాక్ దాటుతుండగా పేలుడు సంభవించి ముగ్గురు మృతి చెందారు. మావోయిస్టులు పేలుడు పదార్థాలు తరలిస్తుండగా ఈ ఘటన జరిగినట్లు నాడు గుర్తించారు.

ఏదేమైనా 15 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో జిల్లా వాసులు ఉలికిపాటుకు గురయ్యారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు సాగు భూములు

వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి ఉద్యమించాలి : రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ

మొగల్లులో ప్రారంభమైన రైతు సంఘం జిల్లా మహాసభ

ఆక్వా రైతులను ఆదుకోవాలి : ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర నాయకులు బి.బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు

రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో విలువైన వ్యవసాయ భూములను కార్పొరేట్లకు కూటమి ప్రభుత్వం కట్టబెడుతోందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ అన్నారు. ఇదిలా కొనసాగితే వ్యవసాయ రంగం కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జాతీయ ఉద్యమంలో ఇచ్చిన భూములు సైతం వెనక్కి తీసుకుంటున్న పరిస్థితి ఉందని చెప్పారు. మొగల్లులో రైతు సంఘం 23వ జిల్లా మహాసభ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, ప్రఖ్యాత శాస్త్రవేత్త ఎఎస్.రావు నగర్, రైతు నేత వలవల శ్రీరామ్మూర్తి స్మారక హాల్లో వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ వేదికపై మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. మహాసభ ప్రారంభ సూచికగా రైతు సంఘం జెండాను సీనియర్ నేత కిలారి తవిటి నాయుడు ఆవిష్కరించారు. మహాసభకు హాజరైన సంఘం నేతలు, ప్రతినిధులు అమరులకు నివాళులర్పించారు. అధ్యక్ష వర్గంగా చీర్ల పుల్లారెడ్డి, తాళ్లూరి హరిహర లక్ష్మణ్, చింతపల్లి లక్ష్మీకుమారి వ్యవహరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్య నారాయణ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల భజన చేస్తోందన్నారు. రాష్ట్రంలో దేవాదాయ, ఇమామ్ భూములు, వ్యవసాయ భూములు కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. 1960లో వచ్చిన విత్తన చట్టానికి తూట్లు పొడిచి నాణ్యమైన విత్తనాలు అందించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విత్తన చట్టం తీసుకొచ్చారని, దీనివల్ల కార్పొరేట్ కంపెనీలకు తప్ప రైతులకు ఎటువంటి ఉపయోగమూ లేదన్నారు. 1995 ఎన్నికల్లో కాంగ్రెస్ రైతుల ఆత్మహత్యల నివారణకు స్వామినాథన్ కమిషన్ ఏర్పాటు వేసిందని ఈ నేపథ్యంలో ఆ కమిషన్ దేశమంతా అధ్యయనం చేసి 20 సూత్రాలు తయారు చేసి ప్రభుత్వం ముందు ఉంచడం జరిగిందని తెలిపారు. నేడు ప్రభుత్వ విధానాలతో రైతులు దివాలా తీసే పరిస్థితి ఏర్పడిందన్నారు. చిన్న, సన్న, పేద రైతులను వ్యవసాయం నుంచి తప్పించేందుకే ప్రభుత్వాలు సమస్యలు పరిష్కరించకుండా మరిన్ని సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం అనేక పాఠాలు ముఖ్యంగా రైతాంగం పోరాటానికి ఒక వేదికను ఏర్పాటు చేసిందని చెప్పారు. రైతులను ఐక్యం చేసి రైతాంగ సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యమాల గడ్డగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో ఉద్యమాలను పునర్మించాలని పిలుపునిచ్చారు.



ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలి

ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర నాయకులు బలరాం

కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించకపోవడం అన్యాయం. వరిని ప్రోత్సహించిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. అతి చిన్న రాష్ట్రమైన కేరళలో రూ.600 బోనస్ కలిపి క్వింటాకు రూ.3 వేలు అందిస్తున్నారు. మన రాష్ట్రంలో ధాన్యానికి గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రొయ్యలు, చేపల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వాలు ఆక్వా రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదు. జిల్లా నుంచి అధిక ఎగుమతులు జరుగుతున్నాయి. రాష్ట్రానికి ఆక్వా రంగం నుంచి ఆదాయం సమకూరుతున్నా వారి సమస్యలు పట్టించుకోకపోవడం సరికాదు. ట్రంప్ సుంకాలతో ఆక్వా రైతులు మరింత కుదేలయ్యారు. ఇతర దేశాలకు ఉత్పత్తులు ఎగుమతయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సరైన గిట్టుబాటు ధర కల్పించాలి.

రైతుల సమస్యలపై విస్తృత పోరాటం



జిల్లాలో రైతుల సమస్యలపై విస్తత పోరాటాలు చేసినట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ తెలిపారు. గత మూడేళ్ల కార్యకలాపాల నివేదికను మహాసభలో ఆయన ప్రవేశపెట్టారు. హాజరైన ప్రతినిధులు ఆమోదించారు. హరే రామ్ మాట్లాడుతూ వ్యవసాయం, ఆక్వా, ఉద్యానరంగాల సమస్యలపై పోరాటాలు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ పంటలు సాగుచేస్తున్న రైతులకు అండగా నిలబడి సమస్యలపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేయడంతో పాటు ఆందోళనలు చేపట్టడం జరిగిందన్నారు. రైతాంగానికి రైతు సంఘం నిరంతరం అందుబాటులో ఉండి వారి పక్షాన పోరాడిందని రాబోయే రోజుల్లో పోరాడుతుందని పేర్కొన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు అశ్రియ్య మాట్లాడారు. మహాసభలో ప్రతినిధులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' పండుగలా నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం కింద రెండో విడత రైతుల ఖాతాల్లో నగదు జమ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్లో మంగళవారం జాయింట్ కలెక్టర్ అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం కింద రైతుల ఖాతాల్లో నగదు జమ కార్యక్రమం, ఖరీఫ్ ధాన్యం సేకరణపై రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు, వ్యవసాయ, రవాణా, పౌర సరఫరాల శాఖ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ నెల 19న ప్రధాని, ముఖ్యమంత్రి ప్రసంగాన్ని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో, రైతు సేవా కేంద్రాల వద్ద డిజిటల్ స్క్రీన్స్ ఏర్పాటు చేసి రైతులు వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి

ధాన్యం సేకరణలో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు అధికారులు సమీక్షించుకోవాలన్నారు. వరి కోత దశలో ఉందని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే 27 లక్షల గోనె సంచులు రైతు సేవా కేంద్రాల వద్ద సిద్ధం చేయడం జరిగిందన్నారు. మరో 33 లక్షల గోనె సంచులు సిద్ధం చేయాలన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు 48 గంటల్లోగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒలు, వ్యవసాయ, రవాణా, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఎంఎఒలు, ఎంఎల్ఒలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకూడదు : జెసి

ఆచంట : ఆచంట నియోజకవర్గంలో సార్వాలో భాగంగా వరి కోతలు ప్రారంభమైనందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, దీనికి ఏర్పాట్లు పగడ్బందీగా ఉండాలని అధికారులను జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆచంట మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయిలో ఆచంట, పోడూరు, పెనుగొండ, పెనుమంట్ర మండలాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గంలో ఇప్పటివరకూ ఎంతమేర వరి కోతలు ప్రారంభమయ్యాయి, ఎన్ని మెట్రిక్ టన్నులు వచ్చింది, ఆర్ఎస్‌కెల ద్వారా ఎంత ధాన్యం సేకరించారనే విషయాలపై ఆరా తీశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. 48 గంటలలో రైతు ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లర్స్ నుండి తీసుకొచ్చిన గోనె సంచులు క్వాలిటీగా ఉండాలన్నారు. మిల్లుల వద్ద హమాలీలు సిద్ధంగా ఉండి రైతులు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యం దిగుమతి చేయాలన్నారు. రైస్ మిల్లుల వద్ద ఆర్ కోడ్ అందుబాటులో ఉంచాలని ఎప్పటికప్పుడు రైతుల నుంచి సమాచారం తెలుసుకోవడానికి ఈ కోడ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులు రాత్రి 7 గంటలు తర్వాత ధాన్యాన్ని మిల్లు వద్దకు తీసుకెళ్లొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ ఎండి ఇబ్రహీం, జిల్లా సహకార శాఖ అధికారి కె.మురళీకృష్ణ, డిఎస్ఒ ఎన్.సరోజ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, తహశీల్దార్లు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు రూ.25 వేలు ఇవ్వాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం



భీమవరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు, నేతలు

ఉచిత బస్సు పథకం వల్ల ఆదాయం కోల్పోయిన ఆటో కార్మి కులకు కనీసం రూ.25 వేలు ప్రకటించి అమలు చేయాలి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసు దేవరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆటో కార్మికుల విస్తత సమావేశం నాయకులు డి చిన్న అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో కార్మికుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రవేశపెట్టిన తర్వాత ఆటో కార్మికులకు ఆదాయాలు తగ్గి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉన్నత చదువులు చదివిన ఆటో కార్మికులకు ఉపాధి లేక ఆటోలు ద్వారా ఉపాధి పొందుతున్నారని, కూటమి ప్రభుత్వం వారి జీవనోపాధిని దెబ్బతీసిందని విమర్శించారు. ప్రతి ఆటో కార్మికునికీ రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. భీమవరంలో ఆటో కార్మికులకు ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా మహాసభ ఈనెల 29, 30 తేదీల్లో పెనుగొండలో జరుగుతున్నాయని అఖిలభారత మహాసభ డిసెంబర్ 31న, జనవరి 1, 2, 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో జరుగుతున్నాయని, ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు రాజు, రవి, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీను, చిన్న పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

పెనుగొండ: సిఐటియు 13వ మహాసభ ఈ నెల 29, 30వ తేదీల్లో పెనుగొండలో జరుగుతాయని జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం సిఐటియు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెలలో భారీ వర్షాలు, తుపాను కారణంగా వాయిదా పడిన మహాసభ ఈ నెల 29, 30 తేదీల్లో జరపాలని జిల్లా సెక్రటేరియట్ నిర్ణయించింది. ఈ మేరకు మహాసభ నిర్వహణకు అవసరమైన సన్నాహాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ మహాసభకు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆహ్వాన సంఘం కోశాధికారి నాగిశెట్టి గంగారావు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: ఈ నెల 29, 30వ తేదీల్లో పెనుగొండలో జరగనున్న సిఐటియు 13వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. భీమవరం సిఐటియు ఆఫీసులో సిఐటియు మండల కమిటీ సమావేశం సిఐటియు మండల కో కన్వీనర్ నాగిడి గోవిందమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో సిఐటియు ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు జరుపుతోందన్నారు. ఈ మహాసభలో కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తీర్మానంచేసి వాటి అమలుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు దీపిక పాల్గొన్నారు.

సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు కోరారు. స్థానిక మహిళా భవన్‌లో మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షతన విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వాసుదేవరావు మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. దేశంలో అసమానతలు పెరుగుతున్నాయని, పరిశ్రమల మూతతో ప్రజల దగ్గర డబ్బులు లేవని తెలిపారు. కారు చౌకగా పెట్టుబడి దారులకు భూములు కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రజల ఆదాయాలు పెంచేందుకు ప్రభుత్వాలు పనిచేయడం లేదన్నారు. ప్రయివేటు జపం చేస్తున్నాయని విమర్శించారు. విశాఖ ఉక్కుపై చంద్రబాబు వ్యాఖ్యలు సరైనవి కావన్నారు. అధ్యక్షులు రాజగోపాల్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రయివేటుకు కట్టబెట్టడం సరికాదన్నారు. యువత సోషలిస్ట్ వ్యవస్థను కోరుతూ పెట్టుబడిదారీ వ్యవస్థ పోవాలని బలంగా కోరుకుంటున్నారని అన్నారు. విశాఖలో జరిగే అఖిల భారత సిఐటియు మహాసభ జయప్రదానికి రాష్ట్రంలోని ప్రతి కార్మికుడూ ఆర్థిక, హార్ధిక సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో జవ్వాది శ్రీనివాస్, చల్లా సోమేశ్వరరావు, యర్రా అజయ్‌కుమార్, కె.రాయపరాజు, సిహెచ్.లక్ష్మి, ఎం.శ్రీదేవి మాట్లాడారు.

మొగల్తూరు : విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐటియు అఖిల భారత మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. మొగల్తూరులోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం సాయంత్రం అఖిల భారత 18వ మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొట్టమొదటిసారిగా విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకూ మహాసభ జరగనున్నట్లు తెలిపారు. మహాసభను ఉద్యోగులు, కార్మికులు విజయవంతం చేయాలన్నారు. వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి ఎడ్ల చిట్టిబాబు, జి.పెద్దింట్లు, ఆర్.ప్రసన్నకుమారి, సీత పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

సిపిఐ ఆధ్వర్యాన ఆందోళనలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, లౌకిక వ్యవస్థను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నడుంకట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, ఫార్వార్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి, ఎంసిపిఐయు జిల్లా నాయకులు కె.మహంకాళి పిలుపునిచ్చారు. సిపిఐ, ఫార్వార్డ్ బ్లాక్, ఎంసిపిఐయు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టే జనగణనలో కులగణన చేపట్టి వాటి ఆధారంగా బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే వారిపై మతోన్మాదులు దాడులకు, హత్యలకు తెగబడుతున్నారని విమర్శించారు. ఈ విధానాలు సమాజానికి, దేశానికి అత్యంత ప్రమాదకరమన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ఎ.సురేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైవి.ఆనంద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీపతి, తిరుమాని కామేశ్వరరావు, నాయకులు నాగిడి శాంతమూర్తి, ఛాన్ భాషా పాల్గొన్నారు.




తణుకు : తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీమారావు

తణుకు : సామాజిక న్యాయం, సమానత్వ సాధన దిశగా జనగణనలో కులగణన చేపట్టి బడుగు, బలహీన వర్గాల జనాభా ప్రాతిపదికన సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ డి.అశోక్‌వర్మకు అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్‌సి, ఎస్‌టి మహిళలపై దాడులు అధికమయ్యాయన్నారు. రాజ్యాంగ బద్ధ హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి మాట్లాడుతూ దేశంలో అణచివేత, అంటరానితనం, కుల, మత వివక్షత పెట్రేగి పోతోందన్నారు. నాయకులు గుబ్బల వెంకటేశ్వరరావు, అమ్మిరాజు, పి.దత్తాత్రేయ ప్రసాద్, పి.వెంకట్రావు, బాలయ్య పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగంపై రాష్ట్రంలోనే జిల్లాకు మొదటి స్థానం రావడం అత్యంత బాధాకరమన్నారు. కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణి మాదకద్రవ్యాల నియంత్రణ, తీసుకున్న చర్యలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మితో కలిపి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా గంజాయి వినియోగం అనే మాట వినిపించకూడదని తెలిపారు. కేసులు గుర్తిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించొద్దని హెచ్చరించారు. కళాశాలలు, పాఠశాలల వద్ద పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఎవరికైనా మాదకద్రవ్యాల వినియోగంపై సమాచారం తెలిస్తే, 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఈగల్ బృందానికి సమాచారం అందించాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు కళాశాలు, పాఠశాలల్లో 826 ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ జిల్లాలో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్‌లో భాగంగా జనవరి నుంచి ఇప్పటి వరకూ 12 కేసులు నమోదు కాగా 57 మందిని నిందితులుగా గుర్తించి, 55 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 40.399 కేజీల గంజాయిని సీజ్ చేశామని తెలిపారు. నిర్మానుష్య ప్రదేశంలో అసాంఘిక కార్యక్రమాలను నివారించేందుకు డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 14న ఈగిల్ టీం, సివిల్ పోలీస్, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్, డాగ్ స్క్వాడ్‌తో కూడిన బందం జిల్లా జాయింట్ ట్రైన్-చెకింగ్ టీం గంజాయి అక్రమ రవాణాను అరికట్టడానికి పూరి నుండి తిరుపతిలో సోదాలు నిర్వహించామని తెలిపారు. ఒడిశాకు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, తణుకు, భీమవరం రైల్వే స్టేషన్ల మధ్య వారి నుండి నాలుగు ప్యాకెట్లలో ప్యాక్ చేసిన సుమారు 10 కిలోల గంజాయి, రూ.2,100 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. డిఎస్‌పిలు ఆర్.జైసూర్య, శ్రీవేద, విశ్వనాథ్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్‌వి.ప్రసాద్ రెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, జిల్లా రవాణా శాఖ అధికారి కెఎస్ఎన్‌వి.కృష్ణారావు, రెవెన్యూ, పోలీస్, ఫారెస్ట్ అధికారులు, ఈగల్ బృందాలు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి


సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్

ప్రజాశక్తి - గణపవరం

దేశ సంపద దోచుకునే కార్పొరేట్ల కోసం విశాఖ ఉక్కును కట్టబెట్టేందుకు తహతహలాడుతూ కార్మికులపై చంద్రబాబు నోరుపారేసుకున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ తీవ్రంగా విమర్శించారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన సిఐటియు మండల విస్తృత సమావేశంలో గోపాలన్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి మండల కన్వీనర్ ఎంపెంటారావు అధ్యక్షత వహించారు. ముందుగా సిఐటియు నాయకులు చింతకాయల బాబూరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కు కార్మికుల వద్దకు వెళ్లి ఏం చెప్పారో గుర్తు తెచ్చుకోవాలన్నారు. విశాఖలో జరిగిన పారిశ్రామిక వేత్తల సమావేశంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెచ్చెట్టి నరశింహామూర్తి, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు, యానిమేటర్ల సంఘం మండల అధ్యక్షురాలు ఎ.సుబ్బలక్ష్మి వ్యకాస మండల అధ్యక్షులు ఎస్‌జసంజీవరావు, నరాలశెట్టి రామకృష్ణ, పి.పద్మ, టి.నళిని, జి.లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - పెనుమంట్ర


జిన్నాను సత్కరిస్తున్న సభ్యులు

జిల్లా ప్రయివేట్ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం మండలంలోని బ్రాహ్మణ చెరువు సాయినాథ్ కళ్యాణ మండపంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పిఎంపి వైద్యుడిగా సేవలందిస్తూ రాష్ట్ర నూర్ భాషా దూదేకుల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ అలీ జిన్నాను పిఎంపి అసోసియేషన్ జిల్లా శాఖ ఘనంగా సత్కరించింది. వైద్యరంగంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ రాజకీయాల్లో రాణించటం శుభ పరిణామమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విపిటి.రాజు, జిల్లా నాయకులు పరమేశ్వరులు కొనియాడారు. సమాజ సేవ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు సాధ్యపడుతుందని జిన్నా నిరూపించారని అసోసియేషన్ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో చిట్టి సుభాన్, పిఎంపి అసోసియేషన్ మండల అధ్యక్షులు గోపాలకృష్ణ, కార్యదర్శి నాగరాజు, ట్రెజరర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం : స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో భీమవరం బాలోత్సవం మూడవ పిల్లల సంబరాల బ్రోచర్‌ను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు, కళాశాల ఛీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్.దిలీప్ చక్రవర్తి, బాలోత్సవం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిశాంత్ వర్మ మాట్లాడుతూ 3వ పిల్లల సంబరాలు తమ కళాశాలలో నిర్వహించుకోనేందుకు ఆతిథ్యం అవకాశం కల్పించామన్నారు. పిల్లలకు వినోదం, విజ్ఞానం, సృజన, శాస్త్రీయ ఆలోచన, దేశభక్తి, సేవా సహాయ దృక్పథం, ఆలోచన పెంపు, అభివృద్ధికి బాలోత్సవాలు దోహద పడతాయని తెలిపారు. ఈ సందర్భంగా బాలోత్సవ కమిటీకి, సభ్యులను అభినందించారు. బాలోత్సవ ఆహ్వాన సంఘం సభ్యులు గాతల జేమ్స్, పి.సీతారామరాజు, పి.శ్రీనివాసరాజు, బి.చైతన్యప్రసాద్, జి.రఫాయేలు పాల్గొన్నారు.

సోషలిజం సాధనకు యువత నడుం కట్టాలి

ప్రజా సంఘాల నాయకులు కేతా గోపాలన్

ఆచంట: సోషలిజాన్ని సాధించేందుకు నేటి యువత నడుం కట్టాలని ప్రజా సంఘాల నాయకులు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద అక్టోబర్ విప్లవ వార్షికోత్సవ సభ సిఐటియు జిల్లా నాయకులు వైట్ల ఉషారాణి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో గోపాలన్ పాల్గొని మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాదులు ఏక ధ్రువ ప్రపంచంగా పరిపాలిస్తున్న సమయంలో కష్టజీవులు చుట్టూ నిరాశ నిస్పృహలు కమ్ముకున్న సమయంలో భవిష్యత్ కష్టజీవులుదే అంటూ 108 సంవత్సరాల క్రితం అక్టోబర్ 17న రష్యాలో సోషలిజం వచ్చిందని, కార్మికులు, రైతులు ఏకమై రష్యాలో దోపిడీ శక్తులను పారద్రోలారని తెలిపారు. అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ వేసిన సుంకాలను ఎదిరించే ధైర్యం లేక ప్రధాని మోడీ దేశ స్వతంత్రాన్ని అమెరికాకు తాకాట పెట్టే విషయంలో వెనుకాడటం లేదని ధ్వజమెత్తారు. సిఐటియు మండల కన్వీనర్ బండి రంగారావు, కో కన్వీనర్ నేలపాటి విజయలక్ష్మి, ఎస్‌వి‌ఎన్.శర్మ, కేత నాగాంజనేయులు, దాసిరెడ్డి కోటేశ్వరరావు, నక్క శైలజ, చిలుకూరి వరలక్ష్మి, బొక్క ఝాన్సీ, ఆరు పల్లి బేబి పాల్గొన్నారు.

'టీచ్ టూల్ ట్రైనింగ్' తనిఖీ

పాలకొల్లు : పాలకొల్లు ఎంఎంకెఎస్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న టీచ్ టూల్ రెండు రోజుల ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను మండల విద్యాశాఖాధికారి గుమ్మళ్ల వీరస్వామి మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా ట్రైనింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి సంతృప్తి చెందారు. మాస్టర్ ట్రైనీస్‌ని ప్రత్యేకంగా అభినందించి, ఈ టీచ్ టూల్ ట్రైనింగ్‌కు ప్రత్యేకంగా ఎంపిక కాబడిన వారందరికి శిక్షణ ఇవ్వబడుతుందని, ప్రతి అబ్జర్వర్ తమ పరిధిలోని పాఠశాలల్లో బోధన పద్ధతులను, విద్యను బోధించడంలో క్వాలిటీని పెంచుకుంటూ వెళ్లాలని, తద్వారా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆకట్టుకుని తదుపరి విద్యా సంవత్సరంలో ప్రవేశాల నమోదు పెంచి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. ట్రైనింగ్ సెంటర్‌లో ప్రతిభ కనబరిచిన టీచర్లకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 అర్‌విఎస్ఎస్.శర్మ, పాఠశాల హెచ్‌ఎం ఎవిఎస్.సత్యనారాయణ, సీనియర్ ఉపాధ్యాయులు భవానీప్రసాద్ రాయపూడి, రాజశేఖర్, పి.రామ, కె.శ్రీనివాసరావు, ఎస్.గణేశ్వరరావు పాల్గొన్నారు.

కళాశాలలో డిజిటల్ మోసాలపై అవగాహన

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఐక్యుఎసి, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్ డిపార్టుమెంట్స్ వారు ఐఐసి కార్యక్రమంలో భాగంగా డిజిటల్ సేఫ్టీ, సైబర్ బుల్లింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజారాజేశ్వరి అధ్యక్షతన జరిగింది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈనాటి కంప్యూటర్ యుగంలో శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్న నేటి కాలంలో అంతకంటే వేగంగా సైబర్ మోసాలు వంటివి సమాజాన్ని పట్టిపీడిస్తూ అభివృద్ధికి కుంటి పరుస్తున్నాయన్నారు. మనిషి తెలివిని సమాజానికి ఉపయోగించాలి కానీ దుర్వినియోగం చేయకూడదని ఎవ్వరికైనా వినాశం తప్పదని, నేటి విద్యార్థులు సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉంటూ ఇతరుల వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోకుండా మెలగాలని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ మాట్లాడుతూ చట్టాల గురించి వివరించారు. ఐక్యుఎసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, ఐఐసి కన్వీనర్ డాక్టర్ డి.స్పెన్ కమిటీ కోఆర్డినేటర్ వెంకటస్వామి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వై.యామిని, సిహెచ్.రవికుమార్, కె.రోహిత్ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పద్ధతులపై శిక్షణ

ఉండి: ఉద్యాన పంటలలో సమగ్ర యాజమాన్యం, ఆధునిక సాంకేతిక పద్ధతులపై ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామ ఉద్యాన సహాయకులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె సమన్వయకర్త డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టెక్నాలజీ పెంపకం, వాటి ఆవశ్యకత గురించి తెలుసుకోవాలన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.బిందు ప్రవీణ మాట్లాడుతూ ఉద్యాన పంటలలో యాజమాన్య కొబ్బరి, మామిడి అరటి, కూరగాయలల్లోని ఎరువుల యాజమాన్యం, చీడ పీడలు, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం కోసం తగాదాలో వ్యక్తిపై దాడి

కుటుంబ సభ్యుల ఆందోళన

మొగల్తూరు: మద్యం కావాలని గొడవ చేస్తున్న వ్యక్తికి సర్దిచెప్పే ప్రయత్నంలో వ్యక్తిని గాయపరిచిన సంఘటన స్థానికంగా చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి పసలదీవి గ్రామానికి చెందిన కొట్టు శివన్నారాయణ కొంత కాలంగా కెపిపాలెంలో నివాసం ఉంటున్నారు. అతని సోదరుడు సుబ్బారావు ఎపెండిసైటిస్ ఆపరేషన్ నిమిత్తం నరసాపురం ఆసుపత్రికి చేర్పించారు. తిరిగి వస్తున్న సమయంలో 10 గంటలు సమయంలో బ్రాందీషాపు వద్ద ఆగారు. మరికొంత సమయంలో బ్రాందీషాపు కట్టివేయడంతో షాపు నిర్వాహకులు మద్యానికి వచ్చిన చామకూరిపాలెంకు చెందిన హరి అనే వ్యక్తికి సమయం అయిపోయింది, మద్యం అమ్మకం కుదరదంటూ దుకాణ నిర్వాహకులు చెప్పారు. హరి వారి మాటలు లెక్కచేయకుండా గొడవకు దిగడంతో శివన్నారాయణ కలగచేసుకుని హరిని సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. దీంతో కోపానికి గురైన హరి శివన్నారాయణను కర్రతో చావబాదే, వెనక భాగంలోను, కాళ్లపై తీవ్రంగా కొట్టి గాయపర్చడంతో స్పృహ కోల్పోయిన శివన్నారాయణ బ్రాందీషాపు వెనుక గల బల్లపై అపస్మారక స్థితిలో పడుకున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మొగల్తూరు నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడనుండి మెరుగైన వైద్యం నిమిత్తం వైద్యులు సూచన మేరకు భీమవరం ఆసుపత్రికి తరలిస్తామని తెలిపారు. జరిగిన సంఘటనపై బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, మద్యం దుకాణం వద్ద జరిగిన సంఘటనకు షాపు యజమానులు బాధితుడుని వైద్య పరంగా ఆదుకోవాలని మద్యం దుకాణం వద్ద ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న మొగల్తూరు ఎస్ఐ వై.నాగలక్ష్మి సిబ్బందితో సంఘటన ప్రాంతానికి చేరుకుని కేసు పాలెం, తూర్పు తాళ్ళ గ్రామాలలో ఉన్న మద్యం దుకాణాలను మూయించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం, బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగలక్ష్మి తెలిపారు.

ఉప్పలూరులో వైరల్ జ్వరాల కలకలం

ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్న సర్పంచి

ఉండి: వైరల్ జ్వరాలతో మండలంలోని ఉప్పలూరు గ్రామం ఉలిక్కిపడింది. రెండు రోజుల క్రితం నుంచి సుమారు పదిమంది ప్లేట్‌లెట్స్ సమస్యతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దీంతో మంగళవారం ఉప్పలూరు గ్రామంలో యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఐసి కీర్తన ఆధ్వర్యాన నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమంలో సుమారు 30 మంది వైరల్ జ్వరాల బారిన పడినట్లు నిర్ధారణ కావడంతో జిల్లా మలేరియా కంట్రోల్ అధికారి డాక్టర్ క్రాంతి, మలేరియా సబ్ యూనిట్ అధికారి డాక్టర్ ఎస్ఎస్.మూర్తి, ఎంపిడిఒ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్.రెడ్డి తదితరులు గ్రామంలో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. దీంతో పలువురు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య సమస్య అధికంగా ఉండని దీనివల్లే వైరల్ జ్వరాల బారిన పడినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా మూడు రోజుల నుంచి గ్రామ సర్పంచి యద్రా దుర్గారావు, టిడిపి గ్రామ అధ్యక్షులు లోకం సుబ్బారావు భీమవరంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా లోకం సుబ్బారావు మంగళవారం సాయంత్రం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యి ఇంటికి చేరుకున్నారు. కాగా దుర్గారావు ఇంకా జ్వరం నుంచి కోలుకోకపోవడంతో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ఒకరు తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరొకరు భీమవరం ఏరియా ఆసుపత్రిలోనూ సుమారు ఆరుగురు భీమవరంలోని వివిధ ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. దీంతో అప్రమత్తమైన వైద్యాధికారులు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి నివారణ చర్యలు తీసుకునే పనిలో ఉన్నారు.

ఏలూరుపాడులో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాళ్ల


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న లయన్స్ సభ్యులు

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరుపాడు లయన్స్ క్లబ్ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు అన్నారు. ఏలూరుపాడులో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏలూరుపాడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఏలూరు ఆశ్రం హాస్పిటల్ వైద్యబృందం సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత ఏలూరు ఆశ్రం హాస్పిటల్‌లో నిర్వహించే ఉచిత ఆపరేషన్లకు సంబంధించిన బ్రోచర్‌ను లయన్స్ క్లబ్ సభ్యులు ఆవిష్కరించారు. వైద్య శిబిరంలో కంటికి, చెవి, ముక్కు, గొంతు, మహిళలకు సంబంధించిన వ్యాధులు, మోకాలు, నడుము నొప్పులు, ఎముకలు, కిడ్నీ స్టోన్స్, గుండె సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఏలూరు ఆశ్రం హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్‌విఎస్.సూర్యనారాయణ రాజు, కృష్ణంరాజు, మోటుపల్లి శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు మంతెన వెంకటరవి వర్మ, కనగర్ల మధుసూదన రావు, డాక్టర్ బాలాజీతో సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి

మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం: ప్లాస్టిక్ రహిత పట్టణంగా తాడేపల్లిగూడెంను తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. మంగళవారం మున్సిపల్ ఛాంబర్ కార్యాలయంలో శానిటేషన్, ఎమినిటీ, ప్లానింగ్ సెక్రెటరీలు, వార్డు ఇన్‌ఛార్జిలు, ప్రజాప్రతినిధులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, మత పెద్దలు కూటమి నాయకులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం వార్డుల్లో పర్యటించి తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని తెలిపారు. పట్టణంలో సుమారు 60 శాతం ప్లాస్టిక్ వినియోగం తగ్గిందన్నారు. అసిస్టెంట్ కమిషనర్, ఎంహెచ్ఒ ఎన్.రాజు, మున్సిపల్ ఇంజినీర్ వై.వెంకట రమణ, టిఎల్ఎఫ్ ప్రెసిడెంట్ పద్మప్రియ, శానిటరీ సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

'అన్నార్తులను ఆదుకోవాలి'

ఉండి: సమాజంలోని అన్నార్తులను ఆదుకునే బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందని ఉండి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. ఉండిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన నిరుపేదలకు ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. చెట్టు పుట్టలపై ఒంటరిగా బతుకుతూ వెళ్లదీస్తున్న అభాగ్యులకు అన్నం పెట్టడం ఎంతో పుణ్యమని కాగిత మహంకాళీ అన్నారు. అన్నాన్ని వృధా చేయొద్దని క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు కోరారు. దాత లయన్ కాగిత మహంకాళీ మాట్లాడుతూ అన్నదానం మహాదానమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ సత్తి బ్రహ్మారెడ్డి, లయన్ బుద్ధరాజు సుబ్బరాజు, లయన్ ముదునూరి సుబ్బరాజు పాల్గొన్నారు. ఉండి మెయిన్ సెంటర్, ఆర్అండ్‌బి బంగ్లా, కొత్తపేట, బాలాజీ రావు పేట తదితర ప్రాంతాల్లో ఆహారపొట్లాలు పంపిణీ చేశారు.

స్వమిత్వ సర్వే ఉపయోగించుకోవాలి: డిపిఒ

గణపవరం: గ్రామాల్లో అధికారులు చేపట్టిన స్వమిత్వ సర్వేను స్థానికులు ఉపయోగించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఎన్.రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం వెంకటరాజపురంలో జరిగిన స్వమిత్వ సభలో పాల్గొని మాట్లాడారు. ఈ సభకి గ్రామ సర్పంచి మల్లంపల్లి సురేష్ అధ్యక్షత వహించారు. సభలో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 2197 గ్రామాల్లో 48 గ్రామాల్లో సర్వే పూర్తిచేసినట్లు చెప్పారు. ఆస్తి యజమానులకు కొలతల యాజమాన్య అభ్యంతరాలుంటే అప్పీలు తీసుకుని సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామకంఠంలో నివాసం ఉంటున్న వారికి హక్కు పత్రాలు లేక, బ్యాంకు రుణాలు పొందలేక పోతున్నారని చెప్పారు. అలాంటి వారికి స్వమిత్వ సర్వేలో ఇళ్ల స్థలాల కొలతలు కొలిచి వారికి పిపిఎన్ నెంబర్ కేటాయిస్తామని, వాటితో పాటు విస్తరణ హద్దులతో కూడిన వివరాలు, ఫొటో ఉంటాయని చెప్పారు. ఈ సభలో గణపవరం డిప్యూటీ ఎంపిడిఒ పల్లి సత్యనారాయణ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోండి

జిల్లా జడ్జి డి.సత్యవతి

తణుకు: డిసెంబరు 13వ తేదీ శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల రాజీపడు పెండింగ్ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, భార్యభర్తల కుటుంబ తగాదా కేసులు, మెయింటెన్స్ కేసులు, మోటారు వాహనాల ప్రమాద కేసులు రాజీ చేసుకోవచ్చునని ఛైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. మంగళవారం స్థానిక కోర్టు హాలులో కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి సత్యవతి మాట్లాడుతూ డొమెస్టిక్ వయొలెన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, బ్యాంకు ఋణ బాకీ కేసులు, ప్రామిశరీ నోటు బకాయి కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేస్తారన్నారు. ప్రతీ రోజూ కోర్టులో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ ద్వారా, మీడియేషన్ ద్వారా కేసులు రాజీ చేస్తున్నారని, జాతీయ లోక్ అదాలత్ లో కేసులు ఎలా రాజీచేసుకోవాలో పోలీసు సిబ్బందిని, కోర్టు సిబ్బందిని, మండల న్యాయ సేవల కమిటీ తణుకు సిబ్బందిని, మరింత సమాచారంకు టోల్ ఫ్రీ నెంబర్ 15100కి ఫోన్ చేసి సలహాలు, సహాయం పొందవచ్చునన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకుని ప్రశాంతంగా జీవించాలని తెలియజేశారు.


కార్టూన్ జాతీయ పోటీల్లో భారతి జయలక్ష్మి సత్తా

తణుకు: తణుకు ఎస్‌కెఎస్‌డి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఎస్ ఆర్గనైజేషన్ ఫర్ నేషనల్ లేవల్ ఆర్ట్ కాంపిటీషన్స్(ముంబాయి) వారు నిర్వహించిన రంగోత్సవ్ కార్యక్రమంలో భాగంగా చిత్రలేఖనం, గ్రీటింగ్ కార్డు తయారీ, కలరింగ్, కార్టున్స్, వ్యంగ్య చిత్రాలు వంటి వివిధ విభాగాల్లో 78 మంది పాల్గొనగా ఎస్.భారతిజయలక్ష్మి కార్టూన్ విభాగంలో జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకుంది. మరో 16 మంది విద్యార్థినులు బంగారు పతకాలను, 8 మంది వెండి పతకాలను, ఐదుగురు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. 30 మంది విద్యార్థినులు అంతర్జాతీయ స్థాయికి ఎంపికైయ్యారని కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విజేతలను అభినందించారు.

మోగల్లులో తాగునీటి సమస్య పరిష్కారం

మిలియన్ల మైక్రో ఫిల్టర్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు


మైక్రో ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

మోగల్లు గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి వేధిస్తున్న తాగునీటి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైందని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. స్థానిక సచివాలయం సమీపంలో పంచాయతీ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన మిలియన్ల మైక్రో ఫిల్టర్, స్థానిక సచివాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఏర్పాటును, ప్రభుత్వ కాలనీలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అన్ని గ్రామాల్లో మైక్రో ఫిల్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. సురక్షితమైన తాగునీరు అందించడం వల్ల ప్రజానీకం ఆరోగ్యంగా ఉంటారని ఈ మైక్రో ఫిల్టర్లపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి శ్రీనివాసును డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి డిప్యూటీ స్పీకర్ అందిస్తున్న సహకారం మరువలేనిదని చెప్పారు. అనంతరం కోరుకొల్లు గ్రామంలో రూ.29 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన 4 సీసీ రోడ్లను డిప్యూటీ స్పీకర్ ప్రారంభించారు. స్థానిక దేవాలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు(చంటి రాజు), పాలకోడేరు సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు, మోగల్లు సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి శ్రీనివాస్, టిడిపి మండల అధ్యక్షులు కొత్తపల్లి సూర్యనారాయణ రాజు(బాబు), టిడిపి గ్రామ అధ్యక్షులు సాంబ్రాణి శంకరుడు, జనసేన అధ్యక్షులు వనము విజయకుమార్, బిజెపి అధ్యక్షులు జనార్ధన రాజు, నాయకులు సందీప్, డాక్టర్ భీమరాజు, గాదిరాజు శ్రీనివాస్ రాజు, మాజీ ఎంపిపి పాల వెంకట చలపతి, గాదిరాజు సూర్యనారాయణ రాజు, నడిపూడి అప్పారావు, కమ్మిలి రాంబాబు, ఎంపిడిఒ రెడ్డియ్య, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సుజాత, పంచాయతీ పాలకవర్గం సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం : సిఐటియు


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అంగన్వాడీలు

వీరవాసరం: ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశం మంగళవారం ఉత్తర పాలెంలో జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజల కొనుగోలు శక్తి రోజు రోజుకీ తగ్గుతుందని, ఉపాధి సమస్య పెరుగుతుందని అన్నారు. ధరలు విపరీతంగా పెరిగి మోయలేని భారంగా మారాయన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల సమస్య ఉందని, ఆన్‌లైన్ పనులు ఎక్కువ కావడం వల్ల నెట్ సదుపాయం సక్రమంగా లేకపోవడంతో అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులకు, అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఆరు సంవత్సరాలు నిండని పిల్లలంతా అంగన్వాడీలలో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎప్పటికప్పుడు అధికారులకు సమస్యలు తెలియజేస్తున్నప్పటికీ పరిష్కారం కాకపోవడం వల్ల నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అఖిలభారత మహాసభ కరపత్రాన్ని విడుదల చేశారు.

గాలి వేగం బట్టి నష్టం

వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

తుపాను సమయంలో వీచే గాలి వేగం బట్టి వరి పంటకు ఏర్పడే నష్టం ఉంటుందని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఇక్కడ ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ గత 55 సంవత్సరాల్లో 61 తపానులు రాష్ట్రంపై ప్రభావం చూపించగా 16 తుపానులు అక్టోబర్ మాసంలోనే వచ్చాయని పేర్కొన్నారు. తుపాను సమయంలో వీచే గాలి వేగం వల్ల వరిలో ఎక్కువగా నష్టం వాటిల్లుతుందని తెలిపారు. గాలివేగం 25 కిలోమీటర్ల కన్నా తక్కువగా ఉంటే పంటపై ఎటువంటి నష్టం ఉండదని, గాలి వేగం 54 - 58 కిలోమీటర్ల మధ్య ఉంటే చేను పడిపోయే అవకాశం ఉందని తెలిపారు. గత మొంథా తుపాను తరువాత వరి పంటపై ఆకు ఎండు తెగులు, మానుకాయ తెగులు ఆశించాయని, ఈ తెగుళ్ల వల్ల వరి పంటపై కలిగే నష్ట నివారణ చర్యల గురించి వ్యవసాయ అధికారులను సమాయత్తం చేయవలసిన అవసరం శాస్త్రవేత్తలపై ఉందని అన్నారు. ఈ దాళ్వా కాలానికి ఎంటియు 1426 అనే చిరుసంచి రకాన్ని, పశిమగోదావరి జిల్లాకు 25 కిట్ల చొప్పున పరిశీలనకు ఇవ్వడం జరుగుతుందని, ఈ రకాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఫలితాలను తెలియజేయాలని వ్యవసాయ అధికారులను కోరారు. ఎంటియు 1426 మిక్కిలి సన్న గింజ రకమని, దీని వేయి గింజల బరువు కేవలం 13.25 గ్రాములు మాత్రమేనని తెలిపారు. ఈ రకం ఎండాకు తెగులు, అగ్గి తెగులు, చలి ప్రభావాన్ని తట్టుకుని మంచి దిగుబడులు ఇస్తుందని తెలిపారు. ఈ నెలాఖరుకు ఎంటియు 1121, ఎంటియు 3626 రకాలు మార్టేరు పరిశోధనా స్థానంలో రైతులకు అందుబాటులో ఉంటాయని, కావలసిన రైతులు సంప్రదించాలని కోరారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 2.12 లక్షల ఎకరాల్లో వరి సాగు అయ్యిందని, తుపాను తరువాత ఆకు ఎండు తెగులు, మానుకాయ తెగుళ్ల ఆశించి నష్టం కలిగిస్తే, తాడేపల్లిగూడెం డివిజన్ లో 13 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, మిగిలిన ప్రాంతాల్లో ఈ నెలాఖరుకు కోతకు వస్తుందని తెలిపారు.

మూర్ఛ వ్యాధిపై అవగాహన

భీమవరం టౌన్ : శ్రీఉమా సోమేశ్వర మున్సిపల్ హైస్కూల్‌లో మూర్ఛ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యాన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కెఎంఆర్ కిషోర్ మాట్లాడుతూ ప్రధానంగా మూర్ఛ వ్యాధి గురించి అవగాహన పెంచడం, తొలి లక్షణాలను గుర్తించడం, సరైన సమయంలో చికిత్స అందించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. మూర్ఛ అనేది మెదడులోని విద్యుత్ తరంగాలలో మార్పుల వల్ల వస్తుందని వివరించారు. జిల్లా ఎపిడెమాలజిస్ట్ గాతల సుభాష్ మాట్లాడుతూ మూర్ఛ వచ్చే ముందు కనిపించే లక్షణాలను గుర్తించడం అవసరం అని ఉదాహరణకు తీవ్రమైన వణుకు, నోటి నుంచి చొంగ కారడం, లేదా నాలుక కొరుక్కోవడం వంటివి జరుగుతాయని అన్నారు. యమీజల వారి స్టేట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చక్రవర్తి, సైకాలజిస్ట్ శ్రీనివాస్, సోషల్ వర్కర్ సుమన్ బాబు మాట్లాడుతూ ఏదైనా మానసిక సమస్యలతో బాధ పడేవారు కేంద్రప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన టెలిమానస్ అనే కార్యక్రమంలో 14416 అనే నెంబర్‌కి ఫోన్ చేయడం ద్వారా మానసిక సమస్యల నివృత్తికి సలహాలు, సూచనలు, వైద్య సహాయం అందిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ పి.మురళీకృష్ణ, జార్జ్ ఇన్స్టిట్యూట్ ఎన్‌జిఒ ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీ, ఇతర ఆరోగ్య, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా రైతులు సాంకేతికను వినియోగించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఆక్వా రైతులు పెట్టుబడిని తగ్గించి లాభాలను అర్జించేందుకు సాంకేతికతను వినియోగించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి రైతులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్లో మత్స్యశాఖ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఇన్‌స్ట్రుమెంట్ ఆఫ్ థింక్స్ ఆక్వా పాండ్స్ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొని ఆక్వా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆక్వా రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని సాధించేందుకు ఆలోచన చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కలెక్టర్ల సమావేశంలో దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో సుమారు 1.30 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుందని, ప్రతి రైతు ఈ పరికరంపై అవగాహన పెంచుకుని వినియోగించి పరిశీలించాలన్నారు. మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఎల్ఎల్ఎన్.రాజు, ప్రసాదరావు, ఆక్వాజెనిక్స్ ప్రో మార్కెటింగ్ సేల్స్ హెడ్ ఎఇ వరప్రసాద్, మార్కెటింగ్ డైరెక్టర్ కొమ్మల మురళీకృష్ణ పాల్గొన్నారు.

పురపాలక సంఘ కార్యాలయము - తణుకు

బహిరంగ వేలం నోటీసు

ఆర్.ఓ.సి.నెం.595/2012-ఎ1

తణుకు పురపాలక సంఘంనకు చెందిన ఈ క్రింది తెలిపిన మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపులను నెలసరి అద్దె విలువ పై 3 సం.ల కాలమునకు లీజుకు ఇచ్చుటకు గాను పురపాలక సంఘ కార్యాలయము నందు ది.26.11.2025న ఉదయం గం.11.30 లకు కమీషనరు వారిచే గాని వారి అనుమతి పొందిన ఇతర అధికారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును.

వ. నెం.	షాపింగ్ కాంప్లెక్స్ పేరు	షాపు నెం.	కేటగిరి	ప్రతిపాదించిన నెలసరి అద్దె విలవ రూ.	సాల్వెన్సీ రూ.
1.	శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజు షాపింగ్ కాంప్లెక్స్	25	ఎస్.టి	4051/-	50,000/-
2.		32	జనరల్	6457/-	1,00,000/-
3		37	జనరల్	6032/-	1,00,000/-
4		FF-2	జనరల్	17561/-	1,00,000/-
5		O8	జనరల్	22061/-	1,00,000/-
6		FF-9	జనరల్	30282-	1,00,000/-
7	శ్రీ రాజీవ్ గాంధి షాపింగ్ కాంప్లెక్స్	FF-2	జనరల్	15595/-	1,00,000/-
8		(SF)01	జనరల్	21203/-	1,00,000/-
9		(SF)02	జనరల్	12927/-	1,00,000/-
10		(SF)03	జనరల్	8400/-	1,00,000/-
11		(SF)Block5	జనరల్	18465/-	1,00,000/-
12		(SF)Block6	జనరల్	15929/-	1,00,000/-
13	శ్రీ ఆదికవి నన్నయ్య షాపింగ్ కాంప్లెక్స్	FF-18	జనరల్	7710/-	1,00,000/-
14		FF-12	జనరల్	4200/-	1,00,000/-
15	శ్రీ యలమర్తి నారాయణరావు చౌదరి పురపాలక సంఘ వాణిజ్య సముదాయం (లారీ స్టాండ్)	8	ఎస్.టి	2449/-	50,000/-
16		21	జనరల్	2800/-	1,00,000/-
17		33	ఎస్.టి	2449/-	50,000/-
18		32	జనరల్	4897/-	1,00,000/-
19		34	జనరల్	5651/-	1,00,000/-
20		35	జనరల్	5651/-	1,00,000/-
21		36	జనరల్	5651/-	1,00,000/-
22		37	జనరల్	3650/-	1,00,000/-
23		38	జనరల్	3600/-	1,00,000/-
24		39	జనరల్	5651/-	1,00,000/-
25		40	జనరల్	4897/-	1,00,000/-
26	పైడిపర్రు	4	బి.సి(రజక& నాయిబ్రాహ్మణ)	1333/-	50,000/-

పై పట్టికలో చూపబడిన డిపాజిట్లు, సాల్వెన్సీ మరియు రిజర్వు చేయబడిన షాపులకు కుల ధృవీకరణ పత్రము దాఖలు చేసిన వారిని మాత్రమే పాటలో పాల్గొనుటకు అనుమతించబడును. పాటను ఏ కారణము చూపకనే లేక రద్దు పరుచుటకు కమీషనరు వారికి అధికారము కలదని తెలియజేయడమైనది.

సం/- కమీషనరు, తణుకు పురపాలక సంఘము.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నరసాపురం: సీతారాంపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షులు కలవకొలను తాతాజీ ప్రారంభించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు సార్వా పంట పూర్తవ్వగానే రైతు సేవా కేంద్రాలు లేదా సొసైటీల ద్వారా ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ జ్యోషిలా, సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) భీమవరం
I.A.No. 608/2025 in O.S.No: 295/2025

Between :
బొక్కా దుర్గా శంకర్ ...వాది
మరియు
బొక్కా గణపతి@గణపతిరావు మరియు వగైరాలు ...ప్రతివాదులు

3వ ప్రతివాది
బొక్కా లక్ష్మి, భర్త : లేటు. పద్మారావు, రాయకుదురు గ్రామం, వీరవాసరం మండలం.
5వ ప్రతివాది : బొక్కా వీర వెంకట సత్యనారాయణ S/o. గణపతి @ గణపతిరావు, రాయకుదురు గ్రామం వీరవాసరం మండలం

పై నెంబరు గ్రంధములో వాది దాఖలు చేసిన పార్టిషన్ దావాలో మీకు పేపరు పబ్లికేషన్ ద్వారా దావా సమన్లు మరియు I.A.No.: 608/2025 లో నోటీసులు ఆర్డరు వేసినందున మీరు 27.11.2025వ తేదిని ఉదయం 10:30 గం.లకు స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క అభ్యంతరములు కోర్టు వారి ఎదుట తెలుపవలెను, లేని యెడల మీ పరోక్షమున విచారణ జరుగునని తెలియపర్చడమైనది.

సం/- వేండ్ర వెంకట మురళీ
అడ్వకేట్, తణుకు-534 211,
సెల్: 9912299454.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, నారాయణపురం కాపురస్తులు ఉండ్రాజవరపు నరేష్ (undrajavarapu naresh) తండ్రి రాఘవులు తన పాస్ పోర్ట్ కలిగిన కవర్ జిరాక్స్ కోసం ఇంటి నుండి తాడేపల్లిగూడెం వెళ్తుండగా ఎక్కడో పడిపోయింది. సదరు పాస్‌పోర్ట్ కోసం వెతికిన దొరకలేదు. ఎవరికైనా నా పాస్‌పోర్ట్ J2938664 దొరికిన యెడల ఈ దిగువ చిరునామాకు తెలియజేసారని ప్రార్థిస్తున్నాను.

Undrajavarapu naresh, S/o.Raghavulu, D.no.3-198, Narayanapuram, Unguturu mandalam Eluru district, Pin 534406, Andhra Pradesh, India. Cell. 9966972476

మహారాజశ్రీ 3వ అదనపు (మొబైల్) జూనియర్ సివిల్ జడ్జి, ఏలూరు
ఓ.యస్.నెం.84/2025

బిట్వీన్ :
అడుసుమిల్లి లక్ష్మి ...వాది
మరియు
వీరాబత్తుల షర్మిల ...ప్రతివాది

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో 2వ ప్రతివాది అయిన వీరాబత్తుల షర్మిల, W/o.దేవదత్తు, R/o.డోరునెం.9-72, Vatluru, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా వారిపై కోర్టులో 12-12-2025 సం॥రం తేదీన ఉదయం గం.10-30 ని॥లకు వాయిదా అయి ఉన్నది. సదరు ప్రతివాది స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని పైకోర్టులో హాజరయి తమ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేని ఎడల సదరు దావా తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలముగా తెలిజేయడం అయినది.

Sri.C.M.U.Prakash Kumar,
Smt.Mahalakshmi Kola
ఏలూరు అడ్వకేట్స్, ఏలూరు.
తేది.7-11-2025 సెల్: 9494873233

PUBLIC NOTICE

Under the instructions of my client M/s.Shriram Finance Ltd. Aswaraopeta Branch Rep. by its Branch Manager it is stated that Kolukuluri Yesu Babu, S/o.Sriramulu, 46 Years, R/o.Bandivarigudem Village, T.Narasapuram Mandal, Eluru District, is creating mortgage against his property shown below as security for the proposed trade loan. If any body having any objection, they can send the objections to me or to my client within 5 days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

SCHEDULE OF THE PROPERTY

House site of an extent of 244 Sq.yards form and out of 629.2 Sq.Yrds in R.S.No.431-2 situated at Bandivarigudem village ; T.Narsapuram Mandal, Eluru District, bounded by :
East : 55 feet Four yards width joint way
South : 40 feet - Place of Kolukuluri Somaiah
West : 55 feet Panchayath CC Road
North: 40 feet Panchayath CC Road

P.Ganesh Babu
Kothagudem Advocate, Kothagudem
Dt.17-11-2025 Cell: 98492 46278

వేలం ప్రకటన
మహారాజశ్రీ నూజివీడు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.10/2024
O.S.234/2016

Between:
సమ్మెట ఝాన్సీరాణి మరియిద్దరు ...DHrs
Vs
కలపాల వరమ్మ మరి యొకరు ...J.Drs

ఈ J.Dr లచే తనఖా ఏర్పరిచిన దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థి ది.19.12.2025వ తేదీన ఉదయం గం.10.30 ని॥ల లగాయితు పైకోర్టు వారిచే పైకోర్టులో వేలం వేయబడును. కావలసిన వారు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు :

పూర్వం కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు సబ్ రిజిష్టార్ ఇలాకా, ఆగిరిపల్లి మండలం, పోతవరప్పాడు గ్రామంలోని లోని R.S.No.198/2A లోని ఎ 0.79 సెం మరియు R.S.No.198/2E లోని ఎ 0.67 సెం. వెరశి ఎ 1.68 సెం భూమికి హద్దులు :
తూర్పు: మండా అబ్రహాం గారి భూమి
దక్షిణం: లింగంపల్లి ప్రకాష్ గారి భూమి
పడమర : కంభంపాటి ధర్మారావు గారి భూమి
ఉత్తరం: పోతవరప్పాడు పొలిమేర
ఈ హద్దుల మధ్యన గల ఎ 1-68 సెం భూమికి
D.Hr విలువ : రూ.20,00,000/-
అమీనా విలువ : రూ.30,00,000/-
వేలం తేదీ : 19.12.2025
Further hearing Date : 30.12.2025

నూజివీడు **ఎస్.వి.భవాని కుమార్**
ది.17.11.2025 న్యాయవాది, నూజివీడు